# చిరిగిపోయిన కాగితం

పున్నామ నరకంలోంచి బైట పడ్డాను అనుకున్నాడు రవి, గదిలోపలినుంచి నర్సువచ్చి మగపిల్లాడు అనేటప్పటికి. తన జీవితంలో యే సుఖం కోసం పరితపించి పోయాడో, అలాంటి సుఖాన్ని యీనాడు పొందకలిగాడు రవి. అదే అతనికి అనంతమైన శాంతి, సంతృప్తి.

పేరు పెట్టే విషయంలో తర్జన భర్జనలు జరగటంవలన, నామకరణము మినహా మిగతా హంగామా అంతా అయిపోయింది. యిరవైవకటో రోజున.

'ఎట్లా చూస్తున్నాడో చూడండి' అంది సుజాత పిల్లవాడి వంకచూస్తూ.

'ఆరు నెలలకే నీ మా ది రి నా మాదిరి చూడమంటా వేమిటి?' అన్నాడు రవి నవ్వుతూ.

'ఏమిటా వెర్రిచూపు అంటూ కళ్ళల్లోకి వూదింది సుజాత. పసిపిల్లాడు వుక్కిరి బిక్కిరయ్యాడు. రవి కోప్పడ్డాడు సుజాతను.

'రేపే అబ్బాయి పుట్టిన రోజు. రేపన్నా యిస్తాడా ఆ సిల్కు బుష్ కోటు' అన్నది సుజాత, రవి వంక ప్రశ్నార్థకంగా చూస్తూ.

'అది సరే కాని ఏమిటా చూపు యివ్వాళా అట్లాగే చూస్తున్నాడు' అన్నాడు రవి యేదో ఆశ్చర్యంగా.

'పసిపిల్లలు యెట్లా చూస్తారో మీకు తెలిసినట్లు మాట్లాడతారె' అన్నది సుజాత, పిల్లాడ్ని చేతుల్లోకి తీసుకుంటూ. రవి యేమి మాట్లాడ లేక పోయాడు.

'నే నంటుంటే నువ్వు యెగతాళిచేస్తూ వచ్చావు. చూస్తున్నావుగా నాలుగేళ్ళ వాడు వుండాలసిన రీతిగానే వుంటున్నాడా. చురుకుతనం లేదు. పైగా చూపులో మార్పులేదు' అన్నాడు రవి.

'మీరంటుంటే నాకు అనుమానంగా వుంది కాని, యింకా రెండు మూడేళ్ళుపోతే, మీ అనుమానాలన్నీ పోతాయి లెండి' అన్నది సుజాత. నేను కోరేదీ అదే అన్నాడు రవి.

'విన్నావా యివ్వాళ బళ్ళో మనవాడ్ని అందరు యెగతాళిచేసి యేడిపించటం మొదలు పెట్టారుట, అమాయకుడుగా వున్నాడుకదా అని. నేను వాళ్ళందర్ని కోప్పడ్డాను అని మాస్టరుగారు నాతో చెప్పాడు' అన్నాడు రవి.

'మా పిచ్చినాన్నని యెగతాళిచేస్తే వూరుకుంటాడను కున్నారా, నేను కనుక్కుంటాను లెండి' అంటూ సమాధానం వచ్చింది.

'ఆ వెకిలిగా నవ్వటం కూడ నాకు అదో విధంగా కనిపిస్తోంది. ఏది చెప్పినా, సరే అని తలవూపటం, తప్ప, ఆలోచించటం అనేదే లేదు, ఏమిటి వీడితీరు నాకు అర్థం కావటం లేదు. అంటూ కంగారుగా సుజాత ముందు నిలబడ్డాడు రవి.

'మీదంతా చిత్రంకానీ, ఇప్పుడే పెద్దగా అలోచించే శక్తి వస్తుందేమిటి మన పిల్లాడ్ని మనం వుప్పత పెట్టుకోవటం కాని' అన్నది సుజాత.

"అందుకు కాదు నేనన్నది. ఈ వయస్సువాళ్ళు అవునంటారు, కాదంటారు. మనవాడు యెప్పుడూ మన్నుతిన్న పాములాగ మందకొడిగా వుండిపోతున్నాడు. అసలు యేదైనా....' అంటూ ఆలోచనలో పడిపోయాడు రవి.

'కొంత మంది చురుకు వాళ్ళుంటారు. కొంత మంది మందకొడి వాళ్ళుంటారు. దీనికోసం యింత ఆదుర్దా యెందుకంట' అన్నది సుజాత, రవి వంక రెప్పార్పకుండా చూస్తూ.

'అదుర్దా యేముంది. ఏళ్ళవుతే వచ్చిపడుతున్నాయి. మ ని షి లో మార్పు లేకపోతే.... రవి పూరుకున్నాడు.

'మైనారిటీ అన్నా వెళ్లనీండి. మార్పు దానంతట అదే వచ్చేస్తుంది' సుజాత జవాబు.

రవి దీర్ఘంగా ఆలోచిస్తూ అట్లాగే నిలబడిపోయాడు.

'వయస్సు కవుతే మెజారిటీ వచ్చింది కాని, బుద్ధికి మాత్రం రాలేదు, విన్నావా మన అబ్బాయి తెలివి తేటలు. పరీక్ష పేపర్లలో ప్రశ్నలన్నింటిని యెక్కించి వచ్చాడుట ఏమిటే యిదంతా' రవి ఆదుర్దా వెళ్ళబుచ్చాడు.

'మా పిచ్చినాన్న పరీక్షలు ప్యాసయి వుద్యోగాలు చెయ్యక్కర్లేదు ఏదో దేవుడిచ్చింది వుంది.' సుజాత సద్దుబాటు.

'ఆ వున్నది యెంతకాలము నిలుస్తుందో వీడిచేతుల్లో, చెవులకు తాటాకు కట్టి యేడిపించరు. చిన్న పొలము విషయము చెపితే దిక్కులు చూస్తుండె....'

'మీకు వున్నంత వ్యవహార జ్ఞానము అబ్బాయికి కూడా వుండాలంటారు అంతేనా? సుజాత ప్రశ్న.

'ఏడిసినట్లుంది. దీంట్లో వ్యవహార జ్ఞానము యేముంది. చెప్పిందేమిటో తెలుసుకోవటం అదీ లేకపోతే'

'మా పిచ్చినాన్న చాలా అమాయకుడు. వాడి మనస్సు మీరు గ్రహించు కుంటేగా.'

'అన్నీ గ్రహించుకుంటూన్నే వున్నా. అసలు విషయం విన్నావా, మన వాడి మెదడు సరిగ్గా లేదుట మొన్న డాక్టర్ని అడిగాను. మన వంశంలో లేదే ఇటాంటిది' రవి సుజాత వంక ఆశ్చర్యంగా చూశాడు.

సుజాత శరీరం క్షణం కంపించింది.

'అన్నవాడి మెదడు సరిగ్గా లేదేమో. చెప్పేవాడికి వినేవాడు లోకువ అని, అయినా మీరు డాకర్ని అడగటం యెందుకు యీ కాస్తభాగ్యానికి. పెళ్లిచేస్తే అన్నీ పోతాయి'

'అయ్యో! అటుచూడు....అ....అ....అగు....ఇంకేమన్నా వుందా మనం అడ్డురాకపోతే దాంతో పెళ్ళాన్ని కొటదామనేగా....వీడికి యీ బుద్ధి యెందుకు పుట్టిందో నాకు అర్థం కావటం లేదు. అన్యాయంగా ఆ పిల్ల గొంతుకకోసి యీ దౌర్భాగ్యుడికి అంటకట్టాము' రవి నిశ్చేష్టుడయిపోయాడు.

'మీదంతా యిది అసలు విషయం యేమిటో తెలుసుకోకుండానే తొందరపడతారు అన్నింటికి'

'ఏమోనే వాడినిచూస్తే నాకు పిచ్చియెత్తి పోతోంది. కోడలు కూడా పసికట్టింది. ఇక మనవాడి పని....'

'అ....కోడలు అటలు సాగనీకే....అయినా యిదెంత కాలం, పిల్లో పిల్లాడో పుట్టుకొచ్చేదాక. [ఎన్ని చూడటంలా లోకం మీద సుజాత సమన్వయింపు'

'వసంత రుతువులో పుట్టింది కాబట్టి వసంత అని పేరు పెటదాము' అన్నాడు రవి.

'అబ్బాయికి అక్షరాభ్యాసము అయ్యేదాక పేరు పెట్టనేలేదు ఇవ్వాళ మనమరాలికి మాత్రం తొందర వచ్చిందేమిటి దైవం రక్షిస్తే తర్వాత చూడచ్చులెండి' సుజాత సవరణ.

'అ....అ....చూశావా....పిల్లని చంపేస్తాడేమిటి ఏమిటా యెగరెయ్యటం....అయ్యో!....నువ్వుకూడా చూస్తూ మొద్దులాగ నుంచుంటావేమిటి....'

'కన్న సంతానాన్ని యెవ్వరూ కూడా మీ మాదిరిగా చూడరు' సుజాత అనుకోకుండా నాలిక కరుచుకుంది.

'బాగానేవుంది నీ సమాధానం. సంతానం కలిగితే యేదో మార్పు వస్తుందన్నావు. నాకేం కనిపించటం లేదు.

'సంతానం కలగలేదని మొదట అదొక తీరు, కలిగిన తర్వాత యివ్వాళ యిదీ వరస' సుజాత సాధింపు.

'సంతానం అంటే యిలాంటిది అనుకోలేదు' రవి తీక్షణ వాక్కుకు సుజాత భయపడిపోయింది. తలకాయ వంచుకుని వంటింట్లోకి వెళ్ళి పోయింది.

'అమ్మాయి మెళ్ళోది కనిపించటం లేదండి' సుజాత ఆశ్చర్యాన్ని వెలి బుచ్చింది.

'అబ్బాయికి తెలివి తేటలు వచ్చినాయన్నావుగా' రవి సమాధానం.

'మా పిచ్చినాన్న యిట్లా చేసేవాడు కాదే. కోడల్ని కనుక్కుంటే సరి.'

'అ....నువ్వు యింకా కనుక్కుంటూనే వుంటావు....'

'కోడలి మెళ్ళోవి కూడా లేవండి. అడుగుతే యేమి మాట్లాడటంలేదు.

'పొలం అమ్ముతానని అడ్వాన్సు తీసుకున్నాడుట. ఇంత డబ్బు యెక్కడ తగల పెట్టాడంట. అడుగుతే సమాధానం లేదేను....' రవి బాధ హెచ్చిపోతోంది.

సుజాత యేమి మాట్లాడ లేదు.

'నా వరకు నాకు యిన్నేళ్ళొచ్చినా పదిరూపాయలు ఖర్చు పెట్టాలంటే ప్రాణం కటకటలాడుతుంది. ఈ నగలన్నీ అమ్మటమేమిటి ఈ షాపు పెట్టట మేమిటి?' రవి సుజాత వంక చూస్తూ ఆశ్చర్యపోయాడు.

సుజాత యేమీ మాట్లాడ లేదు.

'వాడు ప్రయాణం కడుతున్నా డేమిటి. నీకేమన్నా తెలుసా' రవి అదుర్దా వెళ్ళబుచ్చాడు.

'వాడికి వేరే వుండాలని బుద్ధిపుట్టిందిట. కోడలు అంటుంటే యేమో అనుకున్నా' సుజాత ఆశ్చర్య పోయింది.

'మా పిచ్చినాన్న వాడికి వేరే వుంటే బాగుంటుందేమో అనలేదే ఏమిటి అట్లా చూస్తున్నావు' రవి గద్దించాడు.

'ఈ బుద్ధి వాడికి పుట్టినదేనా అని'

'పాపం పుణ్యం యెరుగని అమాయకురాలు, ఆ కోడలి నెత్తిన రుద్దు దామని అనుకుంటున్నావేమిటి?....ఇప్పుడు ఆ పాపు యేం చేస్తాడంట.... నోరెత్తే ఆశలేకపోయిందే....రాను రాను వాడిని చూస్తుంటే తండ్రినైన నాకే భయంగా వుందే' రవి సుజాత వంక చూశాడు.

సుజాత వులిక్కి పడింది.

'వాళ్ళువెళ్లి వారం రోజులైనా వక్క వుత్తరము ముక్కన్నా వ్రాయ లేదేమంట—' అన్నది సుజాత, దిగాలపడి రవి వంక చూస్తూ.

'మనకు వుత్తరం వ్రాసే పనేముంది. కావాలసింది అమ్ముకున్నారు. షాపంటూ వకటి పెట్టాడు. పట్టుపట్టమని పూరుకూడా మార్చేశాడు....అంతా నువ్వు నేర్పిందే' రవి కసురుకున్నాడు.

'కుమారునికి యేది నేర్పినా తల్లే....' సుజాత విదిలింపు.

'ఏమిటి పెట్టె సవరిస్తున్నావు' రవి కళ్ళు పెట్టెలోంచి బట్టల సందు లోనించి క్రిందపడ్డ ఫొటోమీద పడ్డాయి.

'ఈఫోటో యెవరిది?....అంటూ ప్రశ్నించాడు రవి, దానివంక అట్టే చూస్తూ.

సుజాతకు ముచ్చెమ్మట్లు పోసినాయి.

'నేను ఈ ఫోటో ఎక్కడో చూసినట్లున్నానే....' రవి అనుమానంతో ఆలోచనలో పడ్డాడు.

'మనవాడి పాపును ఎవరో తీసుకున్నారుట.

రవి ఏమీ మాట్లాడలేదు.

సుజాత రవి వంకచూస్తూ నిలబడి పోయింది.

'సరితట ఎవరో అమ్మాయి అబ్బాయి పేర ఉత్తరం వ్రాసింది త్వరగా రమ్మని, వెళ్ళింది అక్కడికేనా, మరి యింకో చోటుకా....' రవి వుత్తరం చదవటం మొదటు పెట్టాడు.

సుజాతకు మనస్సు స్థిమితంగా లేదు.

'ఇంటా వంటా లేని యిలాంటి బుద్ధులు వీడికెట్లా అబ్బినాయా అంట....' రవి ఆలోచిస్తూ కూర్చున్నాడు.

సుజాత వచ్చి దగ్గర నిలబడింది. రవి కళ్ళెత్తి సుజాత వంక చూశాడు. సుజాత రవి వంక చూడలేక పోయింది.

వెళ్ళి నెలదాటింది. వకమూల యిలాంటి వార్తలు వింటున్నాం.... మీతో యిప్పుడు చెపుతున్నా. వున్నన్నాళ్ళు తింటాను. లేనినాడు నేనూ వుండను అంటూ వచ్చాడు వెళ్ళేముందర. నాకు చాలా భయంగావుంది.... ఇప్పుడు యెక్కడ వున్నట్లు—సుజాత తలెత్తి రవి వంక చూసింది. సుజాత దద్దరిల్లి పోయింది.

సుబ్బిగాడి ఫొటో కాదుయిది?....చింతనిప్పులాంటి రవి కళ్ళు సుజాత హృదయాన్ని దహించేసినాయి.

సుజాత గజ గజ వణికిపోయింది.

రవి కొర కొరలాడి పోతున్నాడు.

రవి ముందుకు రెండడుగులు వేశాడు.

సుజాత వెనక్కు రెండడుగులు వెళ్లింది.

పేపరు అంటూ అప్పుడే వచ్చాడు.

రవికళ్ళు అనుకోకుండా 'ఆత్మహత్య' అనే శీర్షిక మీద పడ్డాయి, రవి కళ్ళు గబగబ చదివేసినాయి కూడ.

'ఇదిగో అంటూ ఆ పేపరు సుజాత ముఖాన వేసి కొట్టాడు పెద్ద నిట్టూర్పు విడుస్తూ, కుర్చీలో చతికలబడ రవి.

పేపరు హృదయానికి అద్దుకుంటూ హోరుమని ఏడ్చింది సుజాత.